




# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 259 | ఏప్రిల్ 7 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-




# మద్యం మత్తులో యువత చిత్తు

## అమ్మ కన్నీరు..నాన్న నిస్సహాయం

## మద్యం మత్తులో మునిగిన యువత భవిష్యత్తు

## ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం కన్నా..ఆదాయమే ముఖ్యమా?

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**

ఒకప్పుడు ఇంటి ముందు నవ్వులు పూయిస్తూ..తల్లిదండ్రుల ఆశల దీపంగా వెలిగిన ఆ చిన్నారులు..పెరిగి పెద్దవారైన తర్వాత చెడు వ్యసనాలకు బానిసలై..మద్యం మత్తులో తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారు. కళాశాలలో పెనవేసుకున్న స్నేహబంధాలతో పాటు పుట్టి పెరిగిన ఊరిలో చిరుప్రాయం నుండే చిగురించిన చెడు స్నేహాలతో సరదాగా మొదలైన మద్యం అలవాటు క్రమంగా బలపడి బానిసత్వంగా మారి బాటిల్ మత్తులో తమ భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారు. కౌమార దశలో మొదలైన చిన్న చుక్క ఇప్పుడు కుటుంబాన్ని కుదిపేస్తున్న పెద్ద తుఫాన్ గా మారింది. కొడుకు మత్తును విడిచిపెట్టి మారుతాడని గంపెడు ఆశలు పెట్టుకున్న కన్న తల్లులు కన్నీరు మున్నీరవుతున్నారు. చెడు అలవాట్లకు బానిసలైన చెట్టంత ఎదిగిన కొడుకుని దండించలేని కన్నతండ్రులు నిస్సహాయంగా చూస్తూ..ఈ సమాజంలో మౌనంగా మగ్గిపోతున్నారు. కానీ మత్తులో మునిగిన యువతకు ఆ కన్నీళ్లు కనిపించడం లేదు. ఆ కన్నీళ్ల వెనుక దాగి ఉన్న కష్టం విలువ తెలియటం లేదు. మద్యం మత్తులో ప్రతిరోజు ఒక కుటుంబం చిత్తు అవుతూ చితికి పోతుంది. ప్రతిరోజు ఒక భవిష్యత్ మసకబారి చీకటిమయమవుతుంది. ఇది కేవలం ఒక ఇంటి కథ కాదు. సమాజాన్ని మొత్తం కుదిపే నిశ్శబ్ద విపత్తుపై ప్రత్యేక కథనం.

**మద్యం మత్తులో మునిగిన యువత భవిష్యత్**

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా యువతలో మద్యం అలవాటు రోజురోజుకీ పెరుగుతోంది. సరదాగా మొదలైన అలవాటు ఇప్పుడు బానిసత్వంగా మారి కుటుంబాలనే కాక సమాజాన్ని కలవరపెడుతోంది. చదువు, ఉద్యోగం, లక్ష్యాలు అన్ని పక్కన పెట్టి మద్యం మత్తులో జీవితాన్ని చిత్తు చేసుకుంటున్న

# బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

## బాసర సరస్వతి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి మనవడికి అక్షరాభ్యాసం!

**మన దునియా,నిర్మల్ జిల్లా:ఏప్రిల్ 06**

దక్షిణ భారతదేశంలోనే ఉన్న ఏకైక సరస్వతి అమ్మ వారి పుణ్యక్షేత్రం బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రూ"225 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపన చేశారు. ప్రస్తుతం 20,వేల చదరపు అడు గుల



# సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?: రాహుల్ గాంధీ



కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విజయన్ ఏమీ దైవాంశ సంభూతుడు కాదని, ఆయన పాలనలో అహంకారం కనిపిస్తోందని అన్నారు. త్రిస్సూర్‌లో

# పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు: ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత



కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాకిస్థాన్ సోషల్ మీడియా సమాచారం ఆధారంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ భారత ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ప్రతిపక్షం పాకిస్థాన్‌తో సంబంధాలు నెరపుతోందని ఆరోపించారు.అసోంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ,

# నకిలీ సర్టిఫికెట్స్ పెట్టి సంవత్సరాలు గడిచినా చర్యలు లేవు..?

- మహిళా శిశు సంక్షేమ శాఖ భూపాలపల్లి జిల్లా
- రెన్యువల్ కానీ ఉద్యోగులకు జీతాలు ఎలా ఇస్తారు..!
- నివేదికలు వచ్చినా చర్యలు మాత్రం శూన్యం..!
- నకిలీ సర్టిఫికెట్స్ పెట్టి సంవత్సరాలు గడిచినా చర్యలు లేవు..?

**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఏప్రిల్ 06**

భూపాలపల్లి మహిళా శిశు సంక్షేమ శాఖలో పిల్లలకు సేవచేయడంలో సంక్షోభం ఏర్పడి దాదాపుగా రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుంది. తెలంగాణ లో 33 జిల్లాలలో బాలరక్షభవన్ లు ఏర్పాటు చేసి



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

విస్తీర్ణంలో ఉన్న బా సర ఆలయాన్ని సుమారు 60 వేల చదరపు అడుగు ల మేర విస్తరించనున్నారు. కొత్త ఆలయ శిఖరాలు మండపాలు మాఢ వీధులు ఇతర అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. పార తో మట్టి తవ్వి సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబంతో కలిసి బాసర లోని శ్రీజ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం దంప తులు తమ మనవడు రియాన్ష్‌కు అక్షరాభ్యాసం చేయించారు. తరువాత బాసర ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయ విస్తరణ పనులను చేసేందుకు అధికారులు మాస్టర్‌ప్లాన్ రూపొందిం చారు. ఈ ప్లాన్‌లో ఆలయ పునరాభివృద్ధి నమూనా లోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారమే విడుదల చేసింది.

## పాక్ సోషల్ మీడియా సమాచారంతోనే కాంగ్రెస్ నేతల ప్రెస్‌మీట్లు: ప్రధాని మోదీ, అసోం సీఎం హిమంత

దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాకిస్థాన్ పాటనే పాడిందని మండిపడ్డారు. ఈ సంబంధం ఎప్పటి నుంచో సాగుతోందని అన్నారు. జాతీయ భద్రతకు ఇది పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఇటీవల రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వారు పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్లు గుర్తించామని ఆరోపించారు. నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ ఢిల్లీలో, గౌహతిలో రెండు మీడియా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా వారు మాట్లాడిన సమాచారం పాక్ సోషల్ మీడియా నుంచి తీసుకున్నదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసోంలో ఎన్నికలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలు నిర్వహించిందని, ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని తెలిపారు. ఈ ప్రతి టాక్ షోలోనూ కాంగ్రెస్ గెలవాలని పాకిస్థాన్ మీడియా కోరుకుందని వెల్లడించారు.

**కాంగ్రెస్ ఆరోపణలపై ముఖ్యమంత్రి ఆగ్రహం**

హిమంత బిశ్వశర్మ భార్యకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీనితో పాటు ఆమె ఆస్తులను అఫిడవిట్‌లో పేర్కొనలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినందుకు కేసు నమోదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల సమయంలో కావాలని ఇలాంటి ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇందుకు కాంగ్రెస్ శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు. తనపై చేసిన ఆరోపణలకు గాను తన భార్య కేసు పెట్టినట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని అన్నారు.

## సీఎం విజయన్ ఏమైనా దైవాంశ సంభూతుడా?: రాహుల్ గాంధీ

**(మొదటి పేజీ తరువాయి)**

జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన రాహుల్.. కేరళలో బీజేపీ, వామపక్షాల (ఎల్డీఎఫ్) మధ్య రహస్య అవగాహన ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీనివిమర్శించినందుకు తనపై కేంద్ర ఏజెన్సీలు చర్యలు తీసుకున్నాయని, కానీ సీఎం విజయన్‌ను గానీ, ఆయన కుటుంబాన్ని గానీ ఎందుకు ప్రశ్నించడం లేదని రాహుల్ నిలదీశారు. ఈ పరిణామం బీజేపీ, లెఫ్ట్ నేతల మధ్య ఉన్న రాజకీయ ఒప్పందాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. కేరళ పర్యటనల్లో ప్రధాని మోదీ మతపరమైన అంశాలు మాట్లాడతారని, కానీ శబరిమల స్మగ్లింగ్ వ్యవహారంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆయన ప్రశ్నించారు. వామపక్షాలకు సహాయం చేసేందుకే మోదీ ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం విజయన్ ఫొటోలతో ఉన్న పోస్టర్లను ప్రస్తావిస్తూ, పాలన అంతా ఒక్కరే చేస్తున్నారనే అభిప్రాయాన్ని కల్పించడం రాజకీయ అహంకారమని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ తరహా ఏకవ్యక్తి నాయకత్వం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మల పాలనలో కనిపిస్తుందని అన్నారు. కేరళలో పాలన సాగించేందుకు విజయన్ ఒక్కరే సమర్థుడని ప్రచారం చేసుకోవడం ప్రజలను అవమానించడమేనని రాహుల్ అన్నారు. వినయం, ప్రజల సానుభూతి ఉన్న ఎందరో నాయకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజాస్వామ్య నాయకత్వానికి అణకువ అవసరమని హితవు పలికారు. కేరళలో అసలైన పోరాటం యూడీఎఫ్‌కు, బీజేపీ-ఎల్‌డీఎఫ్ కూటమికి మధ్యేనని ఆయన స్పష్టం చేశారు.

# నకిలీ సర్టిఫికెట్స్ పెట్టి సంవత్సరాలు గడిచినా చర్యలు లేవు..?

**(మొదటి పేజీ తరువాయి)**

'నేటి బాలలే రేపటి పౌరులు' గా తీర్చి దిద్దటమే కాకుండా అవసరం ఉన్న పిల్లలకు సేవలు అందించడానికి కొన్ని లక్షల రూపాయల ఖర్చు తో ప్రభుత్వము కొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించి దాదాపుగా 2018 నుండి జిల్లాలో పిల్లలకు సేవలుఅందించే దిశగా ఏర్పాటు చేసింది. అయితే కొంతమంది కాంటాక్ట్ ఉద్యోగులు నకిలీ ధ్రువపత్రాలు పెట్టి సదరు ఉద్యోగాలు చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం అందరికి తెలిసినదే. అయితే ఈ విషయం పైన సంబంధిత అధికారులు కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్టిఫికెట్స్ మరియు ఈ ఉద్యోగులు ఏ సంస్థనుండి అట్టి అనుభవ ధృవీకరణ పత్రాలు తీసుకున్నారో ఆ సంస్థల నుండి వివరణ కూడా తీసుకొన్నారు. అయితే, కొన్ని సంస్థలు వివరణ ఇవ్వగా, మరికొన్ని సంస్థలు ఎలాంటి వివరణలు ఇవ్వలేదు. వీటన్నిటిని క్రోడీకరించి పూర్తి స్థాయిలో విచారణ చేసి కొంతమందిని 'అనుభవ ధ్రువీకరణ పత్రాలు నకిలీవని నిర్ణయించి ప్రభుత్వానికి 'ప్రాథమిక విచారణ నివేదిక' ను పంపించిన విషయం కూడా పాఠకులకు తెలిసినదే. అయితే ఈ నకి'లీల'ను అప్పుడే ఉద్యోగం నుండి తీసేసి, కొత్తగా అర్హతగల నిరుద్యోగులను తీసుకునే వారు..? కాని ప్రభుత్వ అధికారులను అనర్హత గల సిబ్బంది మోసం చేసారు కాబట్టి తుది విచారణ చేసి నకిలీ ధ్రువపత్రాలు పెట్టిన ఉద్యోగులపైన చట్ట ప్రకారము చర్యలు తీసుకొని, వారు ఉద్యోగంలో చేరిన నాటినుండి నేటి వరకు వేతనాలు రికవరీ చేసి ప్రభుత్వానికి తిరిగి చెల్లించే విధంగా చేయాలనే ఆలోచన తో ఆ నకిలీ ఉద్యోగులకు కాంట్రాక్ట్ రెనివల్ గాని, వారి వేతనాలు కానీ, హాజరు రిజిష్టర్లో హాజరుకాని వేయకుండా నిలిపి వేసి తుది విచారణ కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ను వేయడం జరిగింది అనేది గతంలో జరిగిన విషయము.

ఈ అక్రమ చర్యలకు కొందరు ఉన్నతాధికారులు సహకరిస్తున్నారని, వారి మద్దతుతో ఈ వ్యవహారం కొనసాగుతోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది మొత్తం వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. నకిలీ సర్టిఫికెట్లతో పనిచేస్తున్న ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలి సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరపాలి అక్రమాలకు సహకరించిన ఉన్నతాధికారులను కూడా విచారణలోకి తీసుకోవాలి బాలరక్ష భవన్ నిర్వహణలో పారదర్శకత, బాధ్యతను పెంచాలి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన నియంత్రణ వ్యవస్థలు అమలు చేయాలి ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాలల హక్కులను రక్షించే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నాము. లేకపోతే ప్రజా సంఘాలు మరియు బాధితులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. బాలల సంక్షేమం కోసం స్థాపించబడిన బాలరక్ష భవన్ వంటి కీలక సంస్థల్లో కొన్ని ఉద్యోగులు సరైన రీన్యూవల్ లేకుండా, నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు కొనసాగిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రత్యేకంగా, సంబంధిత అర్హతలు మరియు సర్టిఫికెట్లు గడువు ముగిసినప్పటికీ, అవి రీన్యూ చేయకుండా లేదా తప్పుడు పత్రాలు సమర్పిస్తూ కొంతమంది ఉద్యోగులు నిరంతరం జీతాలు పొందుతున్నట్లు సమాచారం. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమే కాకుండా, బాలల భద్రతకు మరియు వారి భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతోంది.

# మద్యం మత్తులో యువత చిత్తు

**(మొదటి పేజీ తరువాయి)**

యువత సంఖ్య ఆందోళన కలిగిస్తుంది. కాలేజీ ప్రాంగాణాల నుంచి బెల్ట్ షాపుల వరకు యువకులు గుంపులుగా కనిపిస్తూ మద్యం సేవించడం సాధారణమైపోయింది. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అవుతుంటే..ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ఆదాయం పేరుతో ఖజానా నింపుకుంటూ..మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిరుద్యోగం ఒత్తిడి, చెడు స్నేహాలు, సోషల్ మీడియా ప్రభావం వంటి కారణాలు యువతను మద్యం వైపు నెడుతున్నాయి. ఒకసారి అలవాటు పడితే దాని నుంచి బయటపడడం కష్టమవుతుంది. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాల పెరుగుదల ఇవన్నీ మద్యం మత్తు వల్లే జరుగుతున్న దుష్పరిణామాలని పలువురు ఆరోపిస్తున్నారు. యువతే దేశ భవిష్యత్తు అంటారు. కానీ అదే యువత మద్యం మత్తులో చిత్తు అయితే సమాజం ఎలా ముందుకు సాగుతుంది? మద్యం నియంత్రణపై కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, కుటుంబ స్థాయిలో పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**ప్రభుత్వాలకు ఆదాయమే ముఖ్యమా?**

మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర బడ్జెట్ లో కీలకంగా మారింది. కోట్ల రూపాయల ఆదాయం ఖజానాకు చేరుతుండగా, ఇదే సమయంలో యువత మద్యం మత్తులో బానిసలుగా మారుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. దీంతో ప్రజల్లో ఒక ప్రశ్న గట్టిగా వినిపిస్తోంది. ప్రభుత్వాలకు ప్రజల ఆరోగ్యం కన్నా..ఆదాయమే ముఖ్యమా? ఒకవైపు మద్యం నియంత్రణపై ప్రచారాలు, నినాదాలు..మరోవైపు మద్యం దుకాణాల విస్తరణ ఈ విరుద్ధ పరిస్థితి తల్లిదండ్రుల గుండెల్లో అనుమానాలను పెంచుతోంది. "మా పిల్లలు మద్యం మత్తులో నాశనం చేసుకుంటుంటే..ప్రభుత్వాలు మాత్రం ఆదాయ గణాంకాలు చూపుతున్నాయి" అనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వాల వాదన వేరేలా ఉంటుంది. మద్యం పూర్తిగా నిషేధిస్తే అక్రమ రవాణా పెరుగుతుందని, నియంత్రిత విక్రయాల ద్వారా ఆదాయం సంపాదించి సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నామని చెబుతుంటాయి. కానీ సామాజికవేత్తలు మాత్రం మద్యం



వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, కుటుంబ విభేదాలు కలిపి చూస్తే ఆర్థిక లాభం కంటే నష్టం ఎక్కువేనని హెచ్చరిస్తున్నారు. ఆదాయం కోసం సమాజ భవిష్యత్తును ఫణంగా పెట్టాలా? లేక ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు కాపాడే విధానాలపై దృష్టి పెట్టాలా? ఈ చర్చకు సమాధానం ఇవ్వాల్సింది మాత్రం ప్రభుత్వాలే.

**దూరం చేయటానికి కఠిన చర్యలు చేపట్టాలి**

ఈ విషయంలో పోలీసులతో పాటు సంబంధిత ఎక్సైజ్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. మద్యం మత్తులో యువత దారి తప్పుతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు కేవలం ఆదాయం కోణంలో కాకుండా సామాజిక బాధ్యతతో ముందుకు రావాల్సిన అవసరం ఉంది. యువతను మద్యం నుంచి దూరం చేయడానికి కఠిన చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కాలేజీల సమీపంలో మద్యం దుకాణాలపై నిషేధం విధించాలి. అండర్ ఏజ్ కు మద్యం విక్రయించే వైన్ షాప్ నిర్వాహకులకు కఠిన శిక్షలు విధించాలి. రాత్రి వేళల్లో విక్రయాలపై పరిమితి విధించి, గస్తీలు పెంచి రాత్రివేళ అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వాహనదారులపై ఉదాసీనత ప్రదర్శించకుండా ఉక్కు పాదం మోపాలి. స్కూల్లు, కాలేజీల్లో దుష్ప్రభావాలపై ప్రత్యేక సెషన్లుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. సోషల్ మీడియా, టీవీల ద్వారా అవగాహన ప్రచారాలు, మత్తు పదార్థాల వలన కుటుంబాలు పడుతున్న కష్టాలపై డాక్యుమెంటరీలు తీసి యువతను మరింత చైతన్యం చేయాలి.

# కొత్త అస్త్రం బయటికి తీసిన ఇరాన్... అమెరికా, ఇజ్రాయెల్‌కు సవాల్!

మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరాన్ తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తూ ఓ సరికొత్త స్టెల్త్ స్ట్రైక్ డ్రోన్‌ను బయటికి తీసింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్‌కు 'హదీద్-110' అని పేరు పెట్టారు. ఇది ఇప్పటికే యుద్ధరంగంలో వినియోగంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి రాడార్లకు చిక్కకుండా, వేగంగా దూసుకెళ్లి లక్ష్యాలను ధ్వంసం చేసేలా దీన్ని రూపొందించినట్లు ఇరాన్ అధికారిక మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోలో వెల్లడించింది. ఈ కొత్త డ్రోన్ ఇరాన్ డ్రోన్ టెక్నాలజీలో ఒక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది సూసైడ్ డ్రోన్ తరహాలో పనిచేస్తుంది. అంటే, లక్ష్యాన్ని చేరుకుని, తనను తాను పేల్చుకుని విధ్వంసం సృష్టిస్తుంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్లు, కమాండ్ సెంటర్లు, కీలకమైన మౌలిక సదుపాయాలే దీని ప్రధాన లక్ష్యాలు. ఇరాన్ ఇప్పటివరకు వినియోగిస్తున్న షాహెద్-136 డ్రోన్‌తో పోలిస్తే, హదీద్-110 దాదాపు మూడు రెట్లు వేగవంతమైనది కావడం గమనార్హం. ఇది గంటకు సుమారు 510 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. హదీద్-110 డ్రోన్‌లో 30 కిలోల బరువున్న శక్తివంతమైన పేలుడు పదార్థాలను (హై ఎక్స్‌ప్లోసివ్ వార్‌హెడ్) అమర్చవచ్చు. దీని పరిధి సుమారు 350 కిలోమీటర్లు కాగా, దాదాపు గంటపాటు గాలిలో ఎగరగలదు. కాంపాక్ట్ జెట్ ఇంజిన్‌తో పనిచేసే ఈ డ్రోన్, డెల్టా-వింగ్ డిజైన్‌ను కలిగి ఉంది. ఈ ప్రత్యేక ఆకృతి వల్లే రాడార్ సిగ్నల్స్‌కు సులభంగా చిక్కకుండా (తక్కువ రాడార్ క్రాస్-సెక్షన్) స్టెల్త్ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. దీన్ని నేరుగా కాటపల్ట్ ద్వారా గాల్లోకి ప్రయోగించి, ఆ తర్వాత జెట్ ఇంజిన్‌ను స్టార్ట్ చేసి ముందుకు పంపిస్తారు. ఇప్పటికే ఈ డ్రోన్‌ను ఉపయోగించి అమెరికా సైనిక స్థావరాలు లేదా సంబంధిత లక్ష్యాలపై తొలి దాడులు జరిగాయని కొన్ని నివేదికలు సూచిస్తున్నాయి. షాహెద్ వంటి నెమ్మదైన డ్రోన్లను ఎదుర్కోవడానికి అలవాటుపడిన అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాల రక్షణ వ్యవస్థలకు ఈ వేగవంతమైన స్టెల్త్ డ్రోన్ కొత్త సవాలుగా మారింది. హదీద్-110 రాకతో మధ్యప్రాచ్యంలో డ్రోన్ యుద్ధ తంత్రంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, ఇది ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత క్లిష్టతరం చేస్తుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ | మంగళవారం | 7 | 2026



# నేడు బాసరలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**

బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, సోమవారం బాసర సరస్వతి ఆలయంలో రూ" 225 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు అక్షరా భ్యాసం కుంకుమార్చనలు సత్యనారాయణ వ్రతాలు వంటి అర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా బాసరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన తర్వాత ఆదిలా బాద్ జిల్లా పిప్రి బహిరంగ సభలో సీఎం పాల్గొనను న్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తైన సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ పర్యటించనున్న నేపథ్యంలో తొలుత నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని సీఎం దర్శించుకుంటారు. అనంతరం బాసర ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. బాసర పుణ్యక్షేత్రాన్ని రూ.225 కోట్లతో పునర్ నిర్మించా లని ప్రభుత్వం నిర్ణయించింది.. జ్ఞాన సరస్వతి కొలువైన బాసర క్షేత్రంలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాసాలు జరుగుతుంటాయి. వసంత పంచమి, ఇతర పర్వదినాల్లో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం, ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.సీఎం రేవంత్ రెడ్డి ఆదేశా లతో సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందిం చారు. ఇందుకోసం శృంగేరి పీఠాన్ని సంప్రదించారు. గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి అనుమతులు తీసుకున్నారు. వారి సూచనలకు అను గుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపు 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు.



# గురుకులాల విద్యార్థులకు ఉచితంగా ఎడ్యుకేషన్ కిట్లు

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 07**


సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ విద్యార్థుల కోసం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లు, కస్తూర్బా పాఠశా లలు, మోడల్ స్కూల్స్, గిరిజన విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక ఎడ్యుకేషన్ కిట్లు అందించనుంది. ఒక్కో కిట్‌లో 24 అవసరమైన వస్తువులు ఉండగా.. దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు లబ్ధి చేకూరనుంది.ప్రత్యేక ఎడ్యుకేషన్ కిట్లలో విద్యార్థుల ప్రతిరోజు ఉపయోగించే వస్తువులు ఉంటాయి. స్కూల్ యూనిఫాం, వైట్ డ్రెస్, షూస్, సాక్సులు, బ్యాగ్, టై, బెల్ట్, ట్రాక్ సూట్, నైట్ డ్రెస్ వంటి దుస్తులతో పాటు.. బెడ్ షీట్, బ్లాంకెట్, టవల్ వంటి వసతి వస్తువులు కూడా అందిస్తారు. అలాగే ప్లేట్, గ్లాస్, కప్పు, స్పూన్, ట్రంక్ బాక్స్, స్టేషనరీ కిట్, నోట్‌బుక్స్ వంటి విద్యా అవసరాలన్నీ ఇందులో భాగం కానున్నాయి.ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం ఇప్పటికే టెండర్ ప్రక్రియ ప్రారంభించింది. మొత్తం 24 వస్తువులను 9 కేటగిరీలుగా విభజించి ప్రత్యేక టెండర్లు పిలిచింది. ఎంపికైన గుత్తేదారులు 45 రోజుల్లోగా సరఫరా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆలస్యమైతే జరిమానాలు విధించడంతో పాటుడ నిబంధనలు ఉల్లంఘిస్తే బ్లాక్‌లిస్ట్ చేసే చర్యలు కూడా తీసుకోనుంది. ప్రతి వస్తువుకు బార్‌కోడ్ కేటాయించి పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రీ-బిడ్ సమావేశం కూడా నిర్వహించి టెండర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చదివే డే స్కాలర్ విద్యార్థులకు కూడా ఉపశమనం కలిగేలా నిర్ణయం తీసుకుంది. వారికి బ్లాక్ షూస్, రెండు జతల సాక్సులు, బెల్ట్ ఇవ్వనుంది. దీని ద్వారా మరో 19 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం చాలా మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చెప్పులు లేకుండా స్కూల్‌కు వెళ్తుండగా ఈ నిర్ణయం వారికి పెద్ద ఊరటగా మారనుంది. 202627 విద్యా సంవ త్సరానికి ముందే ఈ కిట్ల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలల స్థాయి మరింత మెరుగుపడటంతో పాటు.. విద్యార్థుల్లో నమ్మకం పెరు గుతుందని విద్యావర్గాలు భావిస్తున్నాయి.



# తెలంగాణ ప్రజలకు అలెర్ట్..

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు బిగ్ అలెర్ట్..రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇవాళ, రేపు వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఎండల ప్రభావం ఉన్నా..రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో 41 డిగ్రీల మార్క్ ను దాటేశాయి. శనివారం నల్గొండ జిల్లా మాడ్గులపల్లిలో అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 14 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా రికార్డు అయింది. హైదరాబాద్‌లోనూ ఎండలు దంచికొడుతున్నాయి. 38.5 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. ఎండలతోపాటు ఉక్కపోత కూడా ఎక్కువైంది. అయితే, ఇదే సమయంలో వర్షాలు కూడా పడుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.ఐఎండీ అంచనా ప్రకారం.. తొలి రెండు రోజులు ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆ తరువాత రెండు రోజులకు దక్షిణ తెలంగాణ, తూర్పు తెలంగాణ జిల్లాలకు ఐఎండీ అలర్ట్ జారీ చేసింది. బలమైన ఈదురుగాలులు, 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించింది. వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు పడే సమయంలో ఈదురుగాలులు వీచే సమయంలో సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.హైదరాబాద్ లో ఒక పక్క ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ వర్షాలు పడే చాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సాయంత్రం వేళల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ పేర్కొంది.వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రైతులు రబీలో సాగుచేసిన పంటలు ప్రస్తుతం చేతికందే దశలో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు కల్లాల్లో ఆరబోశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలతో రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్న, మిరప తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురిసన వర్షాల కారణంగా రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా బిజెపి పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వాజేడులో

**మన దునియా, వాజేడు: ఏప్రిల్ 06**

వాజేడు మండల కేంద్రంలోని బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ నాయకులు జెండా ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు మండల ప్రెసిడెంట్ పెద్ది జగపతి బాబు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి రూపుదిద్దుకోవడం చాలా సంతోషం గా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు అందరూ సమిష్టిగా పని చేస్తే రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కందుల రామ్ కిషోర్ సీనియర్ నాయకులు సాగి సీతారామరాజు సంద్ర సోమరాజు యలం సుబ్బయ్య ఏడ్చెర్లపల్లి సర్పంచ్ అట్ట మమత దితరులు పాల్గొన్నారు



## జాలర్లకు చిక్కిన మొసలి!

**ఆనందంలో రైతులు!**

**మన దునియా,కోనసీమ జిల్లా: ఏప్రిల్ 06**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత ఆరు నెలలుగా రైతులను భయాందోళనకు గురి చేసిన మొసలి ఎట్టకేలకు పట్టుబడింది. పి. గన్నవరం సమీపంలోని అయినవిల్లి మండలం అయినవిల్లి లంకలోఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక సమాచారం ప్రకా రం, గత ఏడాది వరదల సమయంలో ఈ ప్రాంతం లోకి మొసలి చేరింది. అప్పటి నుంచి నీటి మడుగులు, చెరువుల వద్ద సంచరిస్తూ రైతులు, జాలర్లలో భయాన్ని కలిగించింది. పొలం పనులకు వెళ్లే రైతులు భయంతో జంకేవారు .మొసలిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు పలుమార్లు ప్రయత్నించి నప్పటికీ అవి ఫలించలేదు. దీంతో అధికారులు కొంతకాలం తరువాత ప్రయత్నాలను నిలిపివేశారు. అయితే స్థానిక ప్రజలు మాత్రం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన జాలర్ల వలకు ఆ మొసలి చిక్కింది. వెంటనే వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు మొసలిని సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలిం చే ఏర్పాట్లు చేశారు. మొసలి పట్టుబడడంతో గత ఆరు నెలలుగా భయంతో జీవించిన రైతులు, స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.



## రైతు కష్టం పై రాళ్ల వాన!

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**

ఆరుగాలం కష్టపడి పండించిన పంట కండ్ల ఎదుట ప్రకృతి ప్రళయానికి నాశనం కావడంతో కన్నీటి పర్వంతమైన, రైతన్నలు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, రాజన్న జిల్లా,భూపాలపల్లి జిల్లా,సిద్దిపేట జిల్లా, నిజామాబాద్, అదిలాబా ద్,లకు చెందిన రైతన్నలకు కోలుకోలేని దెబ్బ తగిలిం ది, చేతికొచ్చిన పంట కళ్ళముందే రాలిపోతుంటే ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారు.ప్రతిరోజు వాతావరణంలో ఆకస్మిక మార్పులతో పలు జిల్లాల్లో ఉరుములు, మెరు పులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణా మాలపై ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, తీవ్రత మాత్రం అనేక ప్రాంతాల్లో అంచనాలకు మించినట్టు గాఉంది.ప్రధానంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ అకాల వర్షాలు పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మక్కజొన్న, పప్పుధాన్యా లు నేలకూలిపోవడం, తడిసిపోవడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మిర్చి, పత్తి వంటి వాణిజ్య పంటలు నాణ్యత కోల్పోయే ప్రమా దం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అకాల వర్షాల వెనుక వాతావరణ మార్పులు కీలక కారణంగా భావిస్తున్నారు. తెలంగాణ జిల్లాల్లో చాలా చోట్ల ధాన్యం తడిసి నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇది మార్కెట్ ధరలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నా యి. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని అధికా రులు చెబుతున్నప్పటికీ, గ్రౌండ్ లెవెల్‌లో నష్టాల అంచనా, పరిహారం వంటి అంశాలు రైతులలో సందేహాలు రేకెత్తిస్తున్నా యి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ సహాయం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు!

**మన దునియా,ఖమ్మం జిల్లా: ఏప్రిల్ 06**



ఖమ్మం జిల్లా భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉన్న ఏటపాక, కన్నాయి గూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల, పంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రంతో కలిసి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో ఉన్నాయని వివరించారు. ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారుభద్రాచలం పట్టణ అభివృ ద్ధికి, పాలనా సౌలభ్యానికి ఈ గ్రామాలు అత్యంత కీలకమని, వీటిని తెలంగాణలో కలపడం ద్వారానే స్థానిక గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే దీనికి సంబంధించిన విలీన బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన కేంద్రాన్ని కోరారు. ఈ అంశం రెండ్రోజుల క్రితం రాజ్యసభలోనూ ప్రస్తావన కు వచ్చింది. ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో తెలంగాణ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో ఉండాలని కోరుకున్న గిరిజనులను బలవంతం గా ఏపీలో కలిపారని ఆమె మండిప డ్డారు. విభజన హామీలైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ వంటి అంశాల్లో కేంద్రం తెలంగాణ కు మొండిచేయి చూపిస్తోం దని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రయోజనాల కోసం విభజన చట్టాన్ని వాడుకుంటున్నారని.. తక్షణమే ఐదు గ్రామాలను తెలంగాణకు అప్పగించా లని ఆమె డిమాండ్ చేశారు. భద్రాచలం చుట్టూ ఉన్న ఈ గ్రామాలు భౌగోళి కంగా, సామాజికంగా తెలంగాణతోనే ముడిపడి ఉన్నాయని గుర్తు చేశారు.

## ప్రేమ వివాహం చేసుకున్న భార్యను 8 నెలల్లోనే హత్య చేసిన భర్త...

**మన దునియా,మహబూబ్నగర్: ఏప్రిల్ 06**



శుక్రవారం రాత్రి గొడవ గొంతు నులిమి హత్య మహబూబ్నగర్ జిల్లాలో దారుణ ఘటన. మృతురాలు శ్రీదేవి (21) నర్సింగ్ పూర్తి చేసిన యువతి. కుటుంబాన్ని ఎదిరించి గ్రామానికి చెందిన చందుతో పెళ్లి. పెళ్లి తర్వాత భర్త మద్యం సేవించి వేధింపులు. ఎవరికీ చెప్పుకోలేక మౌనంగా భరించిన భార్య. మృతదేహాన్ని గోనె సంచిలో వేసి పొలానికి తరలింపు. ఆత్మహత్యగా నాటకం చెట్టుకు ఉరేసుకున్నట్లు డ్రామా. సోదరుడికి ఫోన్ చేసి తప్పుడు సమాచారం. గ్రామస్థులు రాగానే నిందితుడు పరారీ. పోస్టుమార్టం లో హత్యగా నిర్ధారణ. అంత్యక్రియలు నిలిపివేస్తూ గ్రామస్థుల ఆందోళన. పోలీసులు నచ్చజెప్పడంతో అంత్యక్రియలు నిర్వహణ. నిందితుడు లొంగి నేరం అంగీకారం. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కానున్నాయి.

## గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా తెలంగాణ

**అంతర్జాతీయ ప్రమాణాలతో గచ్చిబౌలి స్టేడియం**

**క్రీడల్లో దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలి**

**స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**



తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్ గా తీర్చిద్దడమే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో ముఖ్యమంత్రి నేతృత్వంలో స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ పై బోర్డు సభ్యులతో ముఖ్యమంత్రి చర్చించారు. అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాలకు హైదరాబాద్ గమ్యస్థానంగా ఉండేలా సమీకృత క్రీడా కేంద్రంగా గచ్చిబౌలి స్టేడియంను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ఇండోర్ స్టేడియం, ఔట్ డోర్ స్టేడియం, శిక్షణ పొందేందుకు అత్యాధునిక ప్రపంచస్థాయి మౌళిక వసతులతో గచ్చిబౌలి స్టేడియంను తీర్చి దిద్దాలని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అథ్లెటిక్స్, ఫుట్ బాల్ స్టేడియం నిర్మించాలన్నారు. అన్ని రకాల క్రీడలకు శిక్షణ అందించేలా శిక్షణ కేంద్రాలను నిర్మించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ను సీఎం బోర్డు సభ్యులకు వివరించారు. సీఎస్ ఆర్ నిధులతో గచ్చిబౌలి స్టేడియంను అత్యద్భుతంగా అభివృద్ధి చేసేందుకు వ్యాపారవేత్తలు ముందుకు రావాలని కోరారు. దేశంలోనే బెస్ట్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి అన్నారు. స్టేడియం అభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టే వారికి అవసరమైతే వారి బ్రాండింగ్ ను ప్రోత్సహించుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. క్రీడల్లో హైదరాబాద్ ను దేశానికి రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలన్నారు. జూన్ 2లోగా ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో హెలిప్యాడ్ తో సహా అన్ని ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి క్రీడా కారులు నేరుగా హెలికాప్టర్ లో స్టేడియం చేరుకునేలా ఏర్పాట్లు ఉండాలని, భవిష్యత్ లో స్టేడియం నిర్వహణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధికి సంబంధించి ఆర్కిటెక్చర్ ను నియమించామని, స్టేడియం అభివృద్ధిపై బోర్డుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దీర్ఘ కాలంలో తెలంగాణలో క్రీడల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ హబ్ సభ్యులు కొణిదెల ఉపాసన, కావ్యమారన్, సంజీవ్ గోయెంకా, సి. శశిధర్, క్రీడాశాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీ సోనీ బాలా దేవి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మద్యం ధరలు పెంపు?

**మన దునియా,హైదరాబాద్:ఏప్రిల్ 06**



అక్కడెక్కడో పశ్చిమ మాసియాలో జరుగుతున్న యుద్ధం ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోని మద్యం ప్రియులపై ధరల ప్రభావం పడనుంది, వారి జేబులకు చిల్లు పడే అవ కాశాలు కనిపిస్తున్నాయి, మద్యం, బీర్ల ధరలు మే నెలలో పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ పరిస్థితులు, స్థానిక ఉత్పత్తి సమస్యలు కలిసి ధరల పెంపుకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం నేరుగా మద్యం పరిశ్రమపై పడుతోంది. ముఖ్యంగా సహజ వాయువు సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో గాజు సీసాల తయారీ తీవ్రంగా దెబ్బతింది. దీంతో సీసాల కొరత పెరిగి, తయారీ ఖర్చులు బాగా పెరిగాయి. దేశవ్యాప్తంగా గాజు సీసాల ఉత్పత్తి చాలా తగ్గినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని యూనిట్లు పూర్తిగా మూతపడగా, మరికొన్ని ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఖాళీ సీసాల ధరలు కూడా పెరిగి కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఇక రాష్ట్రంలో మద్యం ధరల సమీక్ష గడువు పూర్తవ్వడం మరో కీలక కారణంగా మారింది. గతసారి 2023 మేలో ధరలు సవరించగా, ప్రస్తుతం కొత్త రివ్యూకు సమయం దాటిపోయింది. దీంతో ధరల పెంపు దిశగా ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తయారీ సంస్థలు ఇప్పటికే ప్రభుత్వాన్ని సంప్రదించి 12 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని కోరాయి. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని తాము భరించ లేమని స్పష్టం చేస్తున్నా యి. దీనిపై ప్రభుత్వం కూడా సానుకూలంగా ఆలోచిస్తున్నట్లు సమా చారం. ధరల పెంపుపై నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం జ్యుడీషియల్ కమిటీని నియమించింది. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఈ కమిటీ పరిస్థితులను సమగ్రంగా విశ్లేషిస్తోంది. కమిటీ నివేదిక ఆధారంగా మేలో కొత్త ధరలు ప్రకటిం చే అవకాశం ఉంది. మద్యం ధరలను స్లాబ్ విధానంలో పెంచే ప్రణాళికపై కూడా చర్చ జరుగుతోంది. బాటిల్ పరిమాణం, బ్రాండ్ కేటగిరీ, ధర శ్రేణులను ఆధారంగా చేసుకుని విభజించి పెంపు అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీర్ల విషయంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే సూచనలు ఉన్నాయి. ఇప్పటికే ధరలు పెరిగినప్పటికీ, ప్రస్తుతం క్యాన్ల ధరలు పెరగడం, వేసవిలో డిమాండ్ అధికం కావడం వల్ల మరోసారి ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ





**మన దునియా,భూపాలపల్లి జిల్లా: ఏప్రిల్ 06**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజాదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుండి మొత్తం 18 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

# మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం.

**ఎస్ వి సి క్రషర్ అనుమతులను రద్దు చేయాలని, నూతన క్రషర్ సనాహాలను విరమించుకోవాలని గ్రామస్తుల నిరసన.**

**మన దునియా,శాయంపేట:ఏప్రిల్ 06**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామ శివారులో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ డాంబర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలని , పెద్దగుట్టపై క్రషర్ ప్లాంట్ సన్నాహాలను విరమించుకోవాలని కోరుతూ గ్రామ ప్రజలు మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం అనే కరపత్రాలను గ్రామపంచాయతీ పాలకవర్గం ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రషర్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను రెవెన్యూ మైనింగ్ కలెక్టర్ కు గ్రామానికి జరుగుతున్న నష్టాలను ఇబ్బందులను ఇదివరకే తెలియజేయడం జరిగిందని అన్నారు. ఎస్ వి సి చేస్తున్న బోర్ బ్లాస్టింగ్, గుట్టల విధ్వంసం వల్ల పంట పొలాలు దిగుబడి రావడం లేదని, ఇండ్లు దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ వి సి క్రషర్ వల్ల ఏకంగా గుట్ట కనుమరుగైందని తెలిపారు. ఆ ప్రాంతంలో పెద్ద జలపాతం తలపిస్తుందని అన్నారు. ఇదే కాకుండా డాంబర్ ప్లాంట్ వల్ల వాతావరణం కలుషితమై చెడు వాసన వస్తు ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న క్రషర్ తో అపార నష్టం జరిగిందని, మళ్లీ ఒక కొత్త క్రషర్ వల్ల రైతన్నకి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. రైతులకు గీత కార్మికులకు నష్టం జరిగి తమ జీవన ఉపాధిని కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. అంతేకాకుండా స్థానిక చెరువులు కుంటలు చేపల పెంపకం పై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. పాత క్రషర్ కు అనుమతులు రద్దు చేస్తూ, కొత్త క్రషర్ పర్మిషన్ కు అనుమతులు ఇవ్వద్దని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్టి రెడ్డి రాజిరెడ్డి టిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంట శ్యాంసుందర్ రెడ్డి, రైతులు పల్లెబోయిన రవి సుధాకర్ భాస్కర్ అశోక్ రాజయ్య రవి బిక్షపతి కుమారస్వామి తిరుపతిరెడ్డి సమ్మిరెడ్డి నారాయణరెడ్డి కిరణ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ | మంగళవారం | 7 | 2026



# 9 అంతస్తుల రాజగోపురం... ఈశాన్యన కోనేరు...

**మూడు రెట్లు పెరగనున్న దేవాలయ విస్తీర్ణం....**

**రూ.225 కోట్లతో బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునఃనిర్మాణం**

**శృంగేరి పీఠాధిపతుల అనుమతితో పనులు...**

**మన దునియా,బాసర:ఏప్రిల్ 06**

దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభాస్యాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేయనున్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారట.. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహా లక్ష్మి, మహా కాళి అమ్మ వార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది.

**అక్షరాభ్యాసాలతో...**

జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు...

**శృంగేరి పీఠాధిపతుల అనుమతితో....**

బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు.

**విశాలంగా.. సౌకర్యంగా....**




భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు...

**శిలా నిర్మాణాలు...**

ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో (ఫీడింగ్ రూమ్, ఫుడ్ స్టాల్స్, టాయిలెట్స్ తదితరాలతో) 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంట శాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు... తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు..

**పుష్కరాలకు వచ్చే వారికి....**

గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపట్టనున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు..

# బంజరుపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రొజెక్టర్ విరాళం..





**పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయం**

**మంత్రి తనయుడు ధనసరి సూర్య**

**మన దునియా,ములుగు జిల్లా: ఏప్రిల్ 06**

ప్రవాస భారతీయులు తమ పుట్టిన గ్రామాలను అభివృద్ధి చేయడంలో పాలుపంచుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు దనసరి సూర్య అన్నారు. బంజరుపల్లి గ్రామంలో తన తండ్రి అయిన స్వర్గీయ పురం సంజీవరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సంస్మరణ సమావేశంలో మంత్రి తనయుడు ధనసరి సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజరుపల్లి ప్రాథమిక పాఠశాలకు పురం సురేష్ ప్రొజెక్టర్ ను బహూమానంగా ఇచ్చారు.ఈ సందర్భంగా ధనసరి సూర్య హాజరై మాట్లాడారు.పురం కుటుంబీకులు గతంలో ఇట్టి ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇవ్వడాన్ని గ్రామస్థులు గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు వారి వారసులు అయిన పురం సురేష్ తన తండ్రి గారి ఆశయాలకనుగుణంగా ,వారి దాతృత్వ గుణమును కొనసాగిస్తూ.. గ్రామంలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా మరోసారి ముందుకు రావడం అభినందనీయమన్నారు.ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న వారి కుమారుడు పురం సురేష్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ బోధన అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రొజెక్టర్‌ను అందజేయడం వలన ఈ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకోవడంతో పాటు, కొత్త విషయాలను ఆసక్తిగా నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. అంతే కాక విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల రూపకల్పనకైనా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కంచం రఘు ,ఉపసర్పంచ్ దాసరి గంగయ్య , వార్డు సభ్యులు తప్పట్ల గణపతి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రిపల్లి శ్రీలత , ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ ,వార్డు మెంబర్లు,కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.కాగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మరియు విద్యార్థులు ఈ సందర్భంగా పురం సురేష్ ని శాలువ తో సన్మానించి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి మరియు విద్యా పురోగతికి ఇటువంటి సేవలు మరింత ప్రేరణ కలిగిస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

## పెద్ద కాల్వలోకి కారు దూసుకెళ్లి దంపతుల దుర్మరణం.

**వృద్ధ దంపతులు, ఇద్దరు చిన్నారులను రక్షించిన స్థానిక యువకులు.**

**వెలగతోడులో విషాద ఛాయలు**

**మన దునియా,మండపేట:ఏప్రిల్ 06**



మండపేట మండలం తాపేశ్వరం శివారు పేకేటి పాకలు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం పాలయ్యారు. కారులో ప్రయాణిస్తున్న మృతుడి తల్లిదండ్రులు, ఇద్దరు కుమారులను స్థానిక యువకులు సాహసోపేతంగా రక్షించారు. ఈ ఘటనతో మృతుల స్వగ్రామమైన వెలగతోడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండపేట రూరల్ సీఐ దొరరాజు, ఎస్సై కిషోర్ తెలిపిన వివరాల ప్రకారండ మండపేట మండలం వెలగతోడు గ్రామానికి చెందిన బోగిళ్ల వీర వెంకట సతీష్ (40) రాజమహేంద్రవరం పేపర్‌మిల్లులో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 3న కాకినాడలో జరిగిన కుటుంబ వివాహ వేడుకలకు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అక్కడి నుంచి ఆదివారం రాత్రి తమ స్వగ్రామం వెలగతోడుకు కారులో బయలుదేరారు.కారు సతీష్ స్వయంగా నడుపుతున్నారు. ముందు సీటులో ఆయన పక్కన భార్య పద్మ (36) కూర్చుండగా, వెనుక సీట్లలో సతీష్ తండ్రి వెంకట్రావు, తల్లి పద్మ, కుమారులు మోక్షజ్ఞ, జితేష్ ప్రయాణిస్తున్నారు. మండపేట నుంచి పేకేటి పాకలు రహదారిలో వెలగతోడు వైపు వెళ్తుండగా, పేకేటి పాకలు సమీపంలోని పెద్ద కాల్వలోకి కారు అదుపు తప్పి దూసుకుపోయింది.

ముందుభాగం నీటిలో కూరుకుపోయిడ

ప్రమాదంలో కారు ముందుభాగం కాల్వ నీటిలో కూరుకుపోగా, వెనుక భాగం పైకి కనిపించింది. ఈ సమయంలో అక్కడున్న స్థానిక యువకులు అప్రమత్తమై వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న వృద్ధ దంపతులు, ఇద్దరు చిన్నారులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే డ్రైవింగ్ సీటులో ఉన్న సతీష్, ఆయన భార్య పద్మ నీటిలో మునిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

క్రేన్ సాయంతో మృతదేహాల వెలికితీత

సమాచారం అందుకున్న మండపేట రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, క్రేన్ సాయంతో కారును బయటకు తీయించారు. అనంతరం మృతదేహాలను వెలికి తీసి మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్ తెలిపారు.

గ్రామంలో విషాద వాతావరణం

ఒకే ప్రమాదంలో గ్రామానికి చెందిన యువ దంపతులు మృతి చెందడంతో వెలగతోడులో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో గ్రామం మౌనవిలాపంలో మునిగిపోయింది.

## మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ


**మన దునియా,మదనపల్లె జిల్లా: ఏప్రిల్ 06**



మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డుకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలపై స్వయంగా ఆరా తీశారు. ముఖ్యంగా ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం, సెక్యూరిటీ సిబ్బంది అక్రమ వసూళ్లపై వస్తున్న ఫిర్యాదులపై ఆయన మండిపడ్డారు. రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డయాలసిస్ కేంద్రం రద్దీని గమనించి, త్వరలోనే డయాలసిస్ కోసం మరొక ప్రత్యేక భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వైద్యులు పాల్గొన్నారు. మీ నియోజకవర్గంలో కూడా మీ ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశారా?

## అన్నమయ్య జిల్లా: విద్యార్థినుల రక్షణకు 'డ్రోన్' నిఘా

**మన దునియా,మదనపల్లె జిల్లా: ఏప్రిల్ 06**



మదనపల్లె జిల్లాలో విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ సరికొత్త టెక్నాలజీని రంగంలోకి దించింది. జిల్లా ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు, విద్యాసంస్థల వద్ద ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టేందుకు శక్తి బృందాలు డ్రోన్లతో నిఘా ప్రారంభించాయి. పాఠశాలలు, కళాశాల ప్రారంభం మరియు ముగింపు సమయాల్లో డ్రోన్ల ద్వారా పరిసరాలను జల్లెడ పడుతున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, విద్యార్థినులను వేధించినా వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సాంకేతికతను జోడించి మహిళలకు భరోసా కల్పిస్తున్న పోలీసుల నిర్ణయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం నిఘా కొనసాగుతుందని జిల్లా పోలీస్ శాఖ స్పష్టం చేసింది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించిన పార్టీ బీజేపీ పార్టీ.



**మన దునియా,వరంగల్ జిల్లా నల్లబెల్లి:ఏప్రిల్ 06**



సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించిన ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని బీజేపీ మాజీ జిల్లా కార్యదర్శి సీనియర్ నాయకులు తడుక అశోక్ గౌడ్ అన్నారు. నల్లబెల్లి మండల పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అశోక్ గౌడ్ మాట్లాడుతూ...భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడినప్పటి నుండి సాధారణ కార్యకర్తల శక్తితో ఎదుగుతూ దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించింది. ప్రారంభ దశలో కేవలం 2 ఎంపీ స్థానాలతో ప్రారంభమైన ఈ పార్టీ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ క్రమంగా తన బలాన్ని పెంచుకుందని,అటల్ బిహారీ వాజపేయి గారి నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తన సత్తాను చాటుకున్న బీజేపీ, అనంతరం నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో దేశవ్యాప్తంగా అఖండ విజయాలను సాధిస్తూ పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశ అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందన్నారు. "సబ్కా సాథ్ సబ్కా వికాస్ సబ్కా విశ్వాస్" అనే సిద్ధాంతంతో అన్ని వర్గాల అభ్యున్నతిని లక్ష్యంగా ముందుకు సాగుతోంది పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు , మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు,మండల ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్,బత్తిని కుమారస్వామి, మండల కార్యదర్శి ఓదెల అశోక్ ,కోశాధికారి మురికి మనోహర్, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణము మరియు నూతన స్థలం సాదన కోసం అందరూ సంకటికం కావాలి

**ములుగు జిల్లా ఏప్రిల్ 06 మన దునియా**

ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు వేల్పుకొండ శరబందం అధ్యక్షతన స్థానిక బిసి కార్యాలయంలో జరిగినది ఈ సమావేశంలో పాల్గొన్న సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు నూతన స్థలం కోసం మంత్రిగారిని కలువడం జరిగినది మంత్రి సానుకూలంగా స్పందించి నారు అంతే కానీ ఇప్పటివరకు ఉన్న స్థలాన్ని వద్దని ఎక్కడా చెప్పలేదు అలాగే స్థలాన్ని వదులుకునే ప్రసక్తే లేదని అన్నారు ఇదంతా అర్థం చేసుకోకుండా సంఘీయులను తప్పుతోవ పట్టిస్తూ అభంద్రతా భావానికి గురిచేసే విదంగా సంఘం గ్రూపులో సమాచారం ఇస్తున్న వ్యక్తుల పట్ల సంఘియులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు అలాగే సంఘం అయికమత్యంగా ఉండాలని మాత్రమే కోరుకుంటున్నాము అందుకే అంధరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు సమస్యలు చాలా ఉన్నవి వాటి పరష్కారం కోసం పోరాటాలే శరణ్యం అన్నారు సంకుచిత మనస్థత్వాలు మార్చుకోవాలని హితవు పలికారు ఈ సమావేశంలో పాల్గొన్న వారు వేల్పుకొండ శరబందం ముత్యాల రాజు చెన్న సాంబయ్య వేల్పుకొండ సతీష్ తంగళ్ళపెల్లి నరేందర్ మొగిళిచెర్ల రమేష్ మురహరి రామకృష్ణ జంపాల శ్రీనివాస్



# రవీంద్రభారతిలో ఘనంగా రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్, (RTI)రాష్ట్ర స్థాయి అవగాహనా సదస్సు







**సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరం : డా. చంటి ముదిరాజ్**

**మన దునియా ప్రతినిధి కమలపూర్ బచ్చల శ్రీకాంత్**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్,పై రాష్ట్ర స్థాయి అవగాహనా సదస్సు ఘనంగా నిర్వహించారు. (ఆర్‌టీఐ)సాధన కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సభ్యులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు. ఈ సదస్సుకు ఆర్ టీ ఐ సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్ టీ ఐ,కమిషనర్లు శ్రీనివాస్, భూపాల్ తదితర కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్ టీ ఐ,కారదీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న పనులు, ప్రజలకు సంబంధించిన విషయాలపై సమాచారం పొందే హక్కు ప్రతి పౌరుడికి ఆర్ టీ ఐ,చట్టం కల్పిస్తుందని పేర్కొన్నారు. సదస్సులో ఆర్ టీ ఐ దరఖాస్తును ఎలా ఇవ్వాలి, సమాచారం పొందడంలో ఎదురయ్యే సమస్యలు, అధికారులు సమాచారం ఇవ్వనప్పుడు ఎలా ఆర్ టీ ఐ,కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలి వంటి అంశాలపై నిపుణులు వివరంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి తమిళ్ సినీ నటుడు,కిరణ్,ఆర్ టీ ఐ,సాధన కమిటీ జాతీయ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు,కార్యక్రమం విజయవంతం కావడంతో పాల్గొన్న వారు ఆర్ టీ ఐ,చట్టంపై మరింత అవగాహన పెంపొందించుకుని ప్రజలకు సేవ చేయాలని సంకల్పించారు. సమాచార హక్కు, ప్రజాస్వామ్యానికి బలమైన ఆయుధం, అని పేర్కొన్నారు

# విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత చెన్నూరులో షీ టీమ్ అవగాహన సదస్సు

**మన దునియా మంచిర్యాల జిల్లా ఏప్రిల్: 06.**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ పర్యవేక్షణలో చెన్నూరు ఇన్స్పెక్టర్ బన్సీలాల్ మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఎస్.ఐ.లు హైమ ఉషారాణి ఆధ్వర్యంలో చెన్నూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల కళాశాలలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఒక విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగి మృతి చెందడం మరో ఎనిమిదో తరగతి విద్యార్థిని హాస్టల్‌లో ఆత్మహత్యాయత్నం చేయడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినుల్లో మనోధైర్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్,షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ ఎస్.ఐ.లు మాట్లాడుతూ పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం లేదా ఏదైనా విషయంలో ఓడిపోవడం జీవితాంతం ప్రభావం చూపదని,అది ఒక నేర్చుకునే ప్రక్రియ మాత్రమేనని వివరించారు. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు.... విద్యార్థినులకు యోగా,ధ్యానం మరియు శ్వాస వ్యాయామాల ద్వారా ఒత్తిడిని ఎలా తగ్గించుకోవచ్చో వివరించారు.....తమ సమస్యలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన స్నేహితులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. షీ టీమ్ సేవలు మరియు వాటి ఉద్దేశాన్ని వివరించి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385 లను సంప్రదించాలని సూచించారు.... ..సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని, ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేయడం,వ్యక్తిగత వివరాలు మరియు ఫోటోలు పంచుకోవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.....ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.





# 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తి, ఇంటివద్దే గర్భిణికి సుఖ ప్రసవం

**తల్లి బిడ్డ ఇద్దరూ క్షేమం**

**కుటుంబ సభ్యుల ఆనందం,108 సిబ్బందికి కృతజ్ఞతలు**

**మన దునియా కమలాపూర్ ప్రతినిధి, బచ్చల శ్రీకాంత్**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని జుజునూరుపల్లి గ్రామంలో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి గర్భిణీకి సురక్షిత ప్రసవం చేయించిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పద్మిని (22) అనే గర్భిణీ స్త్రీకి సోమవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో పురిటి నొప్పులు తీవ్రంగా ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ సేవలకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే గర్భిణికి పురిటి నొప్పులు ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రికి తరలించే పరిస్థితి లేకపోవడంతో ఇంటివద్దే ప్రసవం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఈఎంటీ వి. సంజీవ్ మరియు పైలట్ గురునాథ్ సమయస్ఫూర్తితో వ్యవహరించి గర్భిణికి సుఖ ప్రసవం చేయించారు. వారి సహాయంతో పద్మిని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి మరియు బిడ్డ ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం హానుమకొండలోని ప్రభుత్వ మేటర్నిటీ ఆసుపత్రికి తరలించారు. 108 అంబులెన్స్ సిబ్బంది చూపిన సేవాభావం, సమయస్ఫూర్తికి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలను కాపాడే 108 సేవలు మరోసారి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాయి.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
ఏప్రిల్ । మంగళవారం । 7 । 2026


# ద్రావిడ్, కుంబ్లేలకు అరుదైన గౌరవం.. రెండు ఎండ్‌లకు దిగ్గజాల పేర్లు!



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం నిన్న జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌తో సరికొత్త చరిత్రకు వేదికైంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన రసవత్తర పోరుకు ముందు భారత క్రికెట్ దిగ్గజాలు రాహుల్ ద్రావిడ్, అనిల్ కుంబ్లేలకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అరుదైన గౌరవాన్ని కల్పించింది. స్టేడియంలోని రెండు ప్రధాన ఎండ్‌లకు ఈ ఇద్దరు దిగ్గజాల పేర్లను ఖరారు చేశారు. బీఈఎంఎల్ ఎండ్‌కు 'రాహుల్ ద్రావిడ్ ఎండ్' అని పేరు పెట్టారు. పెవిలియన్ ఎండ్‌కు 'అనిల్ కుంబ్లే ఎండ్' అని నామకరణం చేశారు. వీరితో పాటు మాజీ క్రికెటర్ శాంత రంగస్వామి పేరు మీద కూడా స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ద్రావిడ్ మాట్లాడుతూ... "ఈ స్టేడియం నాకు రెండో ఇల్లు లాంటిది. నేను ఈ స్థాయికి చేరుకున్నానంటే దానికి ఈ మైదానమే కారణం" అని కృతజ్ఞతలు తెలిపారు. అనిల్ కుంబ్లే మాట్లాడుతూ... "తొమ్మిదేళ్ల వయసులో ఇక్కడ తొలిసారి మ్యాచ్ చూశాను. నేడు అదే స్టేడియంలో పెవిలియన్ పైన నా పేరు చూడటం చాలా సంతోషంగా ఉంది" అని తన అనుబంధాన్ని పంచుకున్నారు. భారత క్రికెట్‌కు వెన్నెముకగా నిలిచిన ద్రావిడ్ అంతర్జాతీయ కెరీర్‌లో 24,177 పరుగులు చేయగా, స్పిన్ మాంత్రికుడు కుంబ్లే అన్ని ఫార్మాట్లలో కలిపి 956 వికెట్లు పడగొట్టారు. మరోవైపు, ఈ చారిత్రాత్మక ఘట్టం తర్వాత జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. నిర్ణీత ఓవర్లలో 250 పరుగుల భారీ స్కోరు సాధించిన బెంగళూరు, చెన్నైపై 43 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

# బెంగళూరుతో ఓటమి.. అందుకే చెన్నై ఓడిపోయిందన్న అంబటిరాయుడు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో నిన్న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) వ్యూహాలు బాగాలేవని, ధోనీ ఉండి ఉంటే కచ్చితంగా వీటిని ఆమోదించకపోయేవాడని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నాడు. ఆర్సీబీ చేతిలో చెన్నై 43 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాయుడు మాట్లాడుతూ, చెన్నై చివరి నాలుగు ఓవర్లలో 78 పరుగులు ఇచ్చిందని గుర్తు చేశాడు. డెత్ ఓవర్లలో సీఎస్కే వ్యూహాలు బాగా లేవని అన్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో కొత్త ప్రణాళికలు వేసినా కూడా ధోని అంగీకరించే వ్యక్తి కాదని తెలిపాడు. బ్యాట్స్‌మెన్ సులువుగా ఎదుర్కొంటారనే విషయం ధోనీకి బాగా తెలుసని అన్నాడు. డెత్ ఓవర్లలో ఎక్కువగా యార్కర్లు, లెంగ్త్‌తో కూడిన స్లో బంతులే ప్రభావం చూపిస్తాయని పేర్కొన్నాడు. వీటిపై సీఎస్కే బౌలర్లు దృష్టి సారిస్తే బాగుంటుందని రాయుడు సూచించాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఓటమికి బౌలింగ్ వైఫల్యమే కారణమని వ్యాఖ్యానించాడు. తమ బౌలింగ్‌ను సీఎస్కే సమీక్షించుకోవాలని సూచించాడు. సంప్రదాయ బౌలింగ్‌పై దృష్టి సారించాలని అన్నాడు. అటు, బెంగళూరు బ్యాట్స్‌మన్ టిమ్ డేవిడ్ దూకుడైన ఇన్నింగ్స్ వల్ల మ్యాచ్ స్వరూపం మారిపోయిందని సీఎస్కే ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ అన్నాడు. టిమ్ చివరి ఐదు ఓవర్లలో వేగవంతంగా ఆడాడని చెప్పాడు. అతడి ఆటతీరుతో మ్యాచ్ మలుపు తిరిగిందని అన్నాడు. తమ జట్టులో సంజు శాంసన్‌పై తమకు ఎలాంటి అనుమానం లేదని స్పష్టం చేశాడు. జట్టులో అతడు కుదురుకోవడానికి కాస్త సమయం పడుతుందని, అతడి నుంచి కచ్చితంగా మంచి ఇన్నింగ్స్ చూస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ పిచ్‌పై 210 నుంచి 220 పరుగులు చేయవచ్చని, కానీ డేవిడ్ అద్భుతంగా బ్యాటింగ్ చేయడంతో బెంగళూరు 250కి పైగా పరుగులు చేసిందని అన్నాడు. టిమ్ డేవిడ్ 25 బంతుల్లో 70 పరుగులు చేసిన విషయం తెలిసిందే.




# నేను రాణించి ఉంటే బాగుండేది.. ఓటమికి నాదే పూర్తి బాధ్యత: చెన్నై కెప్టెన్




నిన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చేతిలో 43 పరుగుల తేడాతో ఓడిపోవడంతో, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఐపీఎల్–2026 సీజన్‌లో వరుసగా మూడవ ఓటమిని చవిచూసింది. ఈ సీజన్‌లో సీఎస్కే ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. –2.517 నెట్ రన్ రేట్‌తో పట్టికలో అట్టడుగున ఉంది. ఒక ఐపీఎల్ సీజన్ ఆరంభంలో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఇది రెండవ అతి పెద్ద ఓటమి. సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఓటమికి పూర్తి బాధ్యత వహించాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా తాను రాణించి ఉంటే బాగుండేదని, అప్పుడు పరిస్థితి మరోలా ఉండేదేమోనని రుతురాజ్ అభిప్రాయపడ్డాడు. అందుకే ఈ ఓటమికి తానే బాధ్యత వహిస్తున్నానని తెలిపాడు. బౌలింగ్ చేసే సమయంలో 14వ ఓవర్ వరకూ మ్యాచ్ చెన్నై చేతుల్లోనే ఉందని, ఆ తర్వాతే పరిస్థితి మారిపోయిందని అన్నాడు. టిమ్ డేవిడ్‌ను అన్షుల్ కాంబోజ్ క్లీన్ బౌల్డ్ చేశాడని, కానీ అది నో బాల్ అయిందని గుర్తు చేశాడు. ఆ తర్వాత డేవిడ్ మరింత దూకుడుగా ఆడాడని చెప్పాడు. అది నోబాల్ కాకపోయి ఉంటే డేవిడ్ అప్పటికే ఔటై ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఆర్సీబీ అంత స్కోర్ చేసి ఉండేది కాదని పేర్కొన్నాడు. లక్ష్య ఛేదనలోను మేం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయామని తెలిపాడు. సర్ఫరాజ్ ఖాన్, ప్రశాంత్ వీర్, ఒవర్టన్ రాణించారని తెలిపాడు.

# ఐపీఎల్‌కు పీసీబీ ఛైర్మన్ సవాల్: వాస్తవాలు ఏం చెబుతున్నాయి?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లక్ష్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన లీగ్‌గా వెలుగొందుతున్న ఐపీఎల్‌ను తమ దేశపు పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) త్వరలోనే అధిగమిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పీఎస్ఎల్ 11వ సీజన్ సన్నాహకాల్లో భాగంగా జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో నఖ్వీ మాట్లాడారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, పెట్టుబడిదారులకు ఇది ఆకర్షణీయమైన మార్కెట్‌గా మారిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఐపీఎల్‌ను వెనక్కి నెట్టి, ప్రపంచంలోనే నంబర్ వన్ ఫ్రాంచైజీ లీగ్‌గా పీఎస్ఎల్ అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, క్షేత్రస్థాయిలో గణాంకాలకు, నఖ్వీ మాటలకు పొంతన లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఐపీఎల్ విలువ సుమారు 6 బిలియన్ డాలర్లు కాగా, పీఎస్ఎల్ విలువ కేవలం 93 మిలియన్ డాలర్లు మాత్రమే. ఐపీఎల్ ఏడాదికి 1 బిలియన్ డాలర్లకు పైగా ఆర్జిస్తుంటే, పీఎస్ఎల్ ఆదాయం కేవలం 60 మిలియన్ డాలర్ల వద్దే ఉంది. పీఎస్ఎల్ ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోంది. స్టార్ బ్యాటర్ ఫఖర్ జమాన్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడి నిషేధానికి గురవ్వగా, షహీన్ అఫ్రిది, సికందర్ రజాలు భద్రతా నిబంధనలు ఉల్లంఘించి క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొంటున్నారు. భద్రతా కారణాలు, ప్రాంతీయ ఉద్రిక్తతల వల్ల మ్యాచ్‌లను కేవలం రెండు వేదికలకే పరిమితం చేయాల్సి వచ్చింది. ఆదాయం, వ్యూయర్‌షిప్, నాణ్యత పరంగా ఐపీఎల్ దరిదాపుల్లో కూడా లేని పీఎస్ఎల్... నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుందన్న నఖ్వీ వ్యాఖ్యలు కేవలం ప్రగల్భాలేనని క్రీడా పండితులు కొట్టిపారేస్తున్నారు.



మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం




## విజయ్‌తో ఎఫైర్ రూమర్లపై ఆసక్తికర పోస్టులతో స్పందించిన త్రిష

స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్, నటుడు విజయ్‌తో ప్రేమలో ఉన్నారంటూ సాగుతున్న ప్రచారంపై పరోక్షంగా స్పందించారు. ఈ ఊహాగానాలపై ఆమె నేరుగా వ్యాఖ్యానించకపోయినా, తన సోషల్ మీడియాలో పెట్టిన కొన్ని అర్థవంతమైన పోస్టులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, నెటిజన్లు ఈ పోస్టుల వెనుక ఆంతర్యాన్ని విశ్లేషిస్తున్నారు.తన సోషల్ మీడియా ఖాతాలో త్రిష షేర్ చేసిన కోట్స్ ఆకర్షిస్తున్నాయి. 'మన శాంతికి భంగం కలిగించే దేన్నైనా వదిలేయాలి', 'మీ విలువ మీకు తెలిసినప్పుడు, ఇతరుల మాటలు మిమ్మల్ని బాధించలేవు' అనే అర్థం వచ్చేలా ఉన్న ఈ పోస్టులు.. తనపై వస్తున్న పుకార్లకు సమాధానంగానే పెట్టారని పలువురు భావిస్తున్నారు. కొన్నిసార్లు మౌనమే ఉత్తమ సమాధానం అనే భావనను కూడా ఆమె పంచుకున్నారు.గతంలో విజయ్, త్రిష జంటగా నటించిన 'లియో' సినిమా సమయంలో వీరి మధ్య ప్రేమాయణం సాగుతోందంటూ ప్రచారం మొదలైంది. ఇటీవల వీరిద్దరూ విదేశాల్లో కలిశారంటూ కొన్ని ఫోటోలు వైరల్ కావడంతో ఈ పుకార్లు మళ్లీ ఊపందుకున్నాయి. అయితే, ఆ ఫోటోలు మార్ఫింగ్ చేసినవని కొందరు కొట్టిపారేస్తున్నారు.ఈ రూమర్ల నడుమ త్రిష తన కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారించారు. ప్రస్తుతం ఆమె పలు భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అనవసరమైన ప్రచారాన్ని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నారని ఆమె అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## తమిళ టీవీ నటి సుభాషిణి ఆత్మహత్య.. వీడియో కాల్ వాగ్వాదమే కారణమా?

బుల్లితెర నటి సుభాషిణి (36) ఆత్మహత్య ఘటన చెన్నైలో కలకలం సృష్టించింది. భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న సమయంలో జరిగిన వాగ్వాదం ఈ దారుణానికి దారితీసినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. చెన్నై పోరూరులోని ఒక ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సుభాషిణి, ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.శ్రీలంకకు చెందిన సుభాషిణి, తన భర్త పిప్పిన్‌తో కలిసి బెంగళూరులో ఉండేది. అయితే వృత్తిరీత్యా షూటింగ్‌ల కోసం చెన్నైలోని పోరూరులో ఒంటరిగా ఉంటోంది. ప్రముఖ టీవీ సీరియల్ 'కయల్' ద్వారా ఆమె మంచి గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉంది.పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నిన్న రాత్రి భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్నప్పుడు ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత మనస్థాపానికి గురైన ఆమె ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగానే ఆమె గత కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నారని, అదే ఆత్మహత్యకు ప్రేరేపించి ఉండవచ్చని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం పోరూర్ పోలీసులు కేసు నమోదు చేసి, ఆ వీడియో కాల్ లో జరిగిన సంభాషణలు, ఇతర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ హఠాత్పరిణామంతో ఆమె అభిమానులు, తోటి నటీనటులు దిగ్భ్రాంతికి గురయ్యారు.





## 15 ఏళ్లకే ఆ నరకం చూశాను: డీప్‌ఫేక్ ఫొటోలపై జాన్వీ కపూర్

టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న నటి జాన్వీ కపూర్, తన టీనేజ్ రోజుల్లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని పంచుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన జాన్వీ, టెక్నాలజీ దుర్వినియోగం వల్ల తాను ఎదుర్కొన్న మానసిక వేదనను బయటపెట్టింది.స్కూల్ రోజుల్లో జాన్వీకి కేవలం 15 ఏళ్లు ఉన్నప్పుడు, ఆమె ఫొటోను సాంకేతికతతో అసభ్యకరంగా మార్చి ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. తన స్నేహితురాలు ఆ ఫొటోను చూపించే వరకు తనకు విషయం తెలియదని, అది చూసి ఏం చేయాలో పాలుపోక ఎంతో ఏడ్చానని ఆమె ఎమోషనల్ అయింది. సోషల్ మీడియాలో నైతికత ఉండదని ఆ చిన్న వయసులోనే తనకు అర్థమైందని, భవిష్యత్తులో ఇలాంటివి ఎదుర్కోవడానికి అప్పుడే మానసిక ధైర్యాన్ని పెంచుకున్నానని తెలిపింది.ఇప్పుడు తనపై వచ్చే నెగటివ్ కామెంట్లను లేదా మార్ఫింగ్ ఫోటోలను పెద్దగా పట్టించుకోనని జాన్వీ స్పష్టం చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఇలాంటి సవాళ్లు తప్పవని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడమే మార్గమని ఆమె యువతకు సూచించింది. కెరీర్ విషయానికి వస్తే... 'దేవర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఆమె బిజీగా ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com